

# కృతి – ఆకృతి

## – అపర్ణ మునుకుట్ల గునుపూడి



03

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, రాగ, భావములను ప్రస్తావించి, మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే అయినా వాటి సాహిత్య, రాగ, భావ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు. పల్లవి, అనుపల్లవి, పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

గాత్రం: తనికెళ్ళ చంద్ర భాను

రచన: త్యాగరాజు

రాగం: దర్బార్

తాళం: ఆది తాళం

**ఈ కృతిని ఇక్కడ క్లిక్ చేసి వినవచ్చు**

పల్లవి: నారద గురుస్వామీ ఇకనైన నన్నాదరింపవేమి ఈ కరవేమి

అనుపల్లవి: సారెకు సంగీత యోగ నైగమ పారంగతుడైన పరమ పావన

చరణం: ఇతిహాస పురాణాగమ చరితము లెవరివల్ల గలిగె
పతిని దానమివ్వ బుద్ధి సత్యభామ కెటుల గలిగె
ద్యుతిజిత శరదాభ్ర నిను వినా ముని యతుల కెవరు గలిగె
క్షితిని త్యాగరాజ వినుత నమ్మితి
చింత దీర్చి ప్రహ్లాదుని బ్రోచిన

సంగీత నిగమ శాస్త్రాలకి ప్రధమ గురువైన నారదుని పొగడి, వేడుకునే కృతి ఇది. త్యాగరాజు గారు నారదస్వామి నాకీ కరవేమిటి, నన్నాదరించు అంటారు, అనుపల్లవిలో సంగీత, యోగ, నిగమశాస్త్రాల్లో నిపుణుడు, పరమ పావనుడు అయిన నారదుని పొగడుతూ, చరణంలో ఇతిహాస పురాణాలకి, సత్యభామ కృష్ణుడిని దానమివ్వడానికి కారణభూతుడు, మునులకు, యతులకు మార్గ దర్శకుడు, తేజోమయుడు, శరత్కాల మేఘాలవలే ప్రజ్వరిల్లువాడు, అయిన ఓ నారదా ఈ భువిలో నిన్నే నమ్మిన వాడను, ప్రహ్లాదుని బ్రోచిన విధంగా నా చింతలు తీర్చి ఇకనైనా నన్నాదరించవేమి అని వేడుకుంటారు.

కృష్ణ శతకంలో
నీవే తల్లివి తండ్రివి,
నీవే నాతోడు నీడ నీవె సఖుడవు
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!

అన్నట్టు త్యాగరాజు శ్రీ రాముడిని, మనసా, వాచా నమ్మిన పరమ భక్తుడు. అయితే ఈ కృతిలో దానికి విభిన్నంగా నారదుని స్తుతి చేస్తారు. శ్రీ రాముని ఇతిహాస పురాణాలని నిగమశాస్త్ర రహస్యాలని తనకి ఉపదేశించమని అడగకుండా, నారదుని కనికరించమని వేడుకుంటాడు. ఇందులో ప్రత్యేకత ఏమిటంటే, శ్రీ రాముడు అవతార పురుషుడు, అందునా ఏ మహిమలూ లేని మానవావతార పురుషుడు. ఆంజనేయుడు సీతమ్మవారిని కలిసినప్పుడు రాముడిని ఇలా వర్ణిస్తారు.

రక్షితా జీవలోకస్య స్వజనస్యచ రక్షితా
రక్షితా స్వ స్వ వృత్తస్య ధర్మస్యచ పరంతపః

అతి వీర పరాక్రముడు అయిన శ్రీ రాముడు తన వారిని, సకల జనులని, రాజ్య బాధ్యతలని ఎల్ల వేళలా రక్షించువాడు, ధర్మ రక్షకుడు, సత్య వాక్పరిపాలనా దక్షుడు అయినా, తక్కిన విషయాలలో తర్కానికి వెళ్ళడు. పైపెచ్చు త్యాగరాజు గురువులైన శ్రీరామకృష్ణానందులవారు నారదుని వేడుకొమ్మని సలహా ఇస్తారు. పురందరదాసు గారు ఒక కీర్తనలో గురూపదేశం లేకుండా జ్ఞానము, స్నానము, పానము, జపము, తపము, మంత్రము, తంత్రము ఏవీ లేవంటారు. ఆ ప్రకారంగా ఏ పనికైనా ఒక గురువు కావాలి. ఇక్కడ త్యాగరాజుకి కావాల్సింది శాస్త్ర పారంగతుడైన గురువు.

అసలు గురు శిష్య సంబంధం చాలా విచిత్రం. గురువెప్పుడూ మంచి శిష్యుడు కావాలని కోరుకుంటాడు. శిష్యుడెప్పుడూ మంచి గురువుకోసం వెదకుతాడు. అయితే ఇక్కడ నారదుడు ఏ విధంగా గురువుగా అర్హుడు? నారదుడు బ్రహ్మ మానస పుత్రుడు. విధికి, విద్యావతికి పుత్రుడంటే మరి విద్యలకి కొదవేముంది. దేవిభాగవతంలో శివుడుతప్ప నారదునితో సరి తూగగల సప్తస్వర సారవేత్త ముల్లోకాల్లో మరొక్కరు కానరారని అంటారు. త్రికాలజ్ఞానుడు, త్రిలోక సంచారి. పైగా సంగీత, ఆగమశాస్త్ర, వేద వేదాంతాలని భూలోకంలో ప్రచారం చెయ్యమని ఊర్ధ్వలోకంనుంచి పంపించిన మహర్షి. ఎంత కలహప్రియుడైనా శ్రీహరే తన దైవంగా భావిస్తూ, నిరంతరం నారాయణ నామ జపసంపన్నుడు, సకల విద్యాపారంగతుడు, సాక్షాత్ బ్రహ్మ సరస్వతుల పుత్రుడు అయిన నారదుని కన్నా మేలైన గురువెవ్వరు? ఆయన ఉపదేశం పొందని వారెవ్వరు? ధ్రువుడు, మార్కండేయుడు, ప్రహ్లాదుడు, వ్యాసుడు, ఒకరేమిటి, ఎదురుపడ్డవాళ్ళకి ఉపదేశం చెయ్యడం ఆయనకు పుట్టుకతో అబ్బిన విద్య. అందువల్లనే త్యాగరాజువారు నారదుడిని తలచుకుని అంతకు మునుపు ఉద్ధరించిన సత్యభామని, ప్రహ్లాదుడిని ఉదహరిస్తూ, తనకి ఉపదేశ బిక్షపెట్టమని వేడుకుంటారు. ఇక్కడ వీరిని ఉదహరించడంలో ఉన్న విశిష్టత ఏమిటో చూద్దాం!.

సత్యభామ అందగత్తె నన్నఅహంకారంతో, ఎనలేని వజ్రవైడూర్యాలతో ఏడువారాల నగలు, ఆస్తి, అంతస్థుతో అణుకువ తగ్గి శ్రీకృష్ణుడు తన సొత్తు అని ప్రవర్తిస్తున్న సమయంలో నారదుడు ప్రవేశిస్తాడు. స్వాగతోపచారాలు జరిపేక తాను అపురూపసౌందర్యవతినని, శ్రీకృష్ణుడు తనయందనురాగరక్తుడని అతి గర్వంగా చెప్పుకుంటుంది. శ్రీకృష్ణుడు నారదుడివైపు చూస్తాడు. నారాయణుడి ఆంతర్యం నారదుడికెరుకే. సత్యభామ అహంకారం తగ్గించాలన్న ప్రయత్నంలో వాదోపవాదాలు మొదలుపెట్టి కృష్ణుడు రుక్మిణి హృదయేశ్వరుడని, అది మారాలంటే కృష్ణుడిని దానంచేసి ఆ తర్వాత అతని ఎత్తు ధనంతో మళ్ళీ కొనుక్కుంటే ఆవిడకి సొంతం అవుతాడని బోధిస్తాడు. సత్యభామ అదెంత పని, తనకున్న ధనంతో కొనుక్కోగలనన్న ధీమాతో, ఆ వ్రతాన్ని సంకల్పించి ఆ ప్రకారంగా కృష్ణుడిని దానం చేస్తుంది. ఆ తర్వాత తులాభారంలో తన నగలన్నిటిని వేసినా కృష్ణుడికి సరి తూగవు. నీ నిలువెత్తు నగలు ఇంతేనా అని నారదుడు హేళన

చేస్తాడు. దాంతో సహ పత్నుల నగలు తెచ్చి వెయ్యమని కోరుతుంది. అవి కూడా చాలవు. నారదుడు శ్రీకృష్ణుడిని తీసుకుని బయలుదేరుతాడు. సత్యభామకు ఏం చేయాలో తోచక తన అహంకారాన్ని అణుచుకుని రుక్మిణిని శరణు వేడుతుంది . అప్పుడు రుక్మిణి వచ్చి తులలో ఉన్న కృష్ణుడికి భక్తితో నమస్కరించి, తులలో రెండోవైపు తులసిదళం వేస్తుంది. దాంతో తుల సమంగా తూగుతుంది. అది చూసి తన తప్పు తెలుసుకుని అహంకారాన్ని విడిచి కృష్ణుడిని భక్తితో సేవించుకుంటుంది సత్యభామ.

ఇక ప్రహ్లాద చరిత్ర చూస్తే , అతనికి ఊహ తెలియడానికి ముందరే శ్రీహరి భక్తి తత్వాన్ని ఉపదేశిస్తాడు నారదుడు. కారణం ఏదైనా అతని ప్రమేయం లేకుండానే అతనిలో భక్తి బీజం గాఢంగా నాటుకుని, అది పెరిగి మహావృక్షమై అతన్నిపరమ భాగవతోత్తముడిని చేయగల శక్తినిస్తుంది.

పై కథలు చూస్తే, ఒక కథలో జ్ఞానం తెలియని దశలో ఒక పసివానికి హరి భక్తిని రుచి చూపడం, ఇంకొక కథలో లోక మెరిగిన ఒక వ్యక్తికి అహంకారాన్ని తగ్గించే మార్గం చెప్పడం జరుగుతుంది. త్యాగరాజువారు సహజంగా సద్గుణవంతులు. అయినా తనలో ఏ కోశానైనా అహంకారం ఉంటె దాన్ని అణచి, అజ్ఞానంలో ఉన్న తనకి విజ్ఞానాన్ని ప్రసాదించమని, ఈ కథలు వివరిస్తూ వారి శిష్యరికం ప్రసాదించమని నారదుడిని గురువుగా వేడుకోవడంలో వారి వినయశీలత్వం సుస్పష్టమౌతుంది. ఇలా వేడుకున్న త్యాగరాజు వారికి నారదులవారు సాక్షాత్కరించి సంగీత భాండాగారమైన స్వరార్ణవం అందించి అంతర్ధానమైయ్యారని ప్రతీతి. ఆ విధంగా వారు నారదులవారిని సంగీత దర్బార్ లో కొలువుంచి వారిపై భక్తి ప్రపత్తులతో రచించిన కృతిని ఈ నెల గురు పౌర్ణమి నాడు ఆలపించిన, ఆలకించిన వారందరికీ సత్ఫలితాలు, సద్గురూపదేశ ప్రాప్తి కలుగుతుందని మనసారా నమ్ముతూ.

సంగీతం ఇదం పుణ్యం సంగీతం ఇదం సౌఖ్యం
సంగీతం ఆరోగ్యప్రదం సంగీతం శాంతియుతం

తనికెళ్ళ చంద్ర భాను కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొందిన ఏ. ఐ. ఆర్ కళాకారిణి. దుర్గాబాయి దెష్ముఖ్ సంగీత కళాశాలలో సంగీతాచార్యులుగా పని చేస్తున్నారు. దేశ విదేశాల్లోను, టీటీడీ, ఎస్ వి బి సి ఛానెల్ లోను విరివిగా కచేరిలు చేస్తుంటారు. ప్రస్తుతం బెంగళూరు నివాసస్తులు.

COMMENTS